







సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 25-9-2024

సంపుటి: 20 సంచిక: 156

పేజీలు: 4 వెల: రూ.1


## మత్స్యకారుల ఉపాధిపై ప్రత్యేక దృష్టి

- మూలపేట పోర్టు, భోగాపురం ఎయిర్ పోర్టులతో ఉపాధి
- దీపావళికి ఉచిత గ్యాస్ పథకం అమలు
- సంయుక్తంగా ప్రకటించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

జిల్లా మత్స్యకారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. బుధవారం కుందువానిపేట గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌లతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఒకటో తేదీ తెల్లవారేసరికే పెంచిన పెన్షను పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. మత్స్యకారులకు ఉపాధి లేక వలసలు పోతున్నారని, ఉపాధిపై పెద్ద ఎత్తున దృష్టి పెట్టి మూలపేట పోర్టు సంవత్సరం లోగా పూర్తి చేసి ఈ ప్రాంతంలోని మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుందని, భోగాపురం ఎయిర్ పోర్ట్ పూర్తి - మిగతా 4లో

# 'ఫకీరు'

## వేషాలకేం తక్కువలేదు

ఆయన పేరు ఫకీరు. నరసన్నపేటలో ఉంటాడు. ఫకీరు కదాని పెద్ద కంజీరా పట్టుకొని తలపాగా చుట్టుకొని, మెడలో పూసలు ధరించి పొడుగాటి లాల్చీ వేసుకొని మొలకు గళ్ల లుంగీని కట్టుకుంటాడనుకుంటే పొరపాటే. కాకపోతే ఫకీరు వేషాలు మాత్రం వేస్తుంటాడు. ఫకీరు ఆ ఫకీరులాగే తన చుట్టూ ముగ్గురు నలుగుర్ని పెట్టుకుంటాడు. అక్కడ ఫకీరు పాడుతుంటాడు.. ఇక్కడ ఫకీరు సొమ్ములు లెక్కపెడుతుంటాడు. ఈ ఫకీరు డబ్బు సంపాదించడానికి ఉన్న అన్ని అక్రమ మార్గాలూ తెరిచి అతి తక్కువ కాలంలోనే కోట్లాది రూపాయలు గడించిన అమీరు.



- గోల్డ్‌షాపు బాయ్‌గా జీవితం ప్రారంభం
- గోవా కేసినోలో వాటాలు
- పేకాట శిబిరాల్లో పెట్టుబడులు
- ఇప్పుడు గంజాయి రవాణాలో కీలకపాత్ర

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డబ్బు సంపాదించడం తప్పు కాదు. అయితే అందుకు ఎంతో మంది జీవితాలను బలపీఠాలు ఎక్కించి, ఆ సొమ్ముతో ఇప్పుడు జిల్లాలో ప్రముఖుడుగా చెలామణి అవుతున్నారు. కొన్నేళ్ల క్రితం నరసన్నపేటలో ఉన్న ఒక బంగారం షాపులో సేల్స్‌మెన్‌గా పని చేసిన బోయిన ఫకీరు ఇప్పుడు నరసన్నపేటలో రాజకీయ నాయకులకు, ఎన్నికలకు ఫండింగ్ ఇచ్చే స్థాయికి ఎదిగిపోయారు. దీని వెనుక కథాకమామీషు ఒక్కసారి తెలుసుకుందాం. క్రికెట్ ఆట మీద పందాలు కాయడం మొదలైన దగ్గర్నుంచి ఈయన పంట పండింది. చిన్నబుకీగా స్థానిక యువత నుంచి సొమ్ములు వసూలు చేసి ప్రారంభించిన అక్రమాల జీవితం ఆ తర్వాత ఇదే నరసన్నపేటలో కుమార్ అనే మరో క్రికెట్ బుకీ కలిసిన తర్వాత మొత్తం మారిపోయింది. కుమార్‌కు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అప్పటికే బుకీగా చీకటి సామ్రాజ్యంలో గుర్తింపు వచ్చేసింది. ఒక బేకరీలో పని చేసిన కుమార్ బుకీగా పైస్థాయికి వెళ్లిపోవడంతో ఆయనకు బినామీగా ఫకీర్‌ను పెట్టుకున్నాడు. అప్పట్నుంచీ ఈయన ద్వారా క్రికెట్ బెట్టింగులకు దిగడం మొదలుపెట్టారు. ఐపీఎల్ సీజనైతే నేరుగా లైన్ తీసుకొని బెట్టింగులు వేసే వీరు మిగిలిన అన్ని ఆటలకు, అన్ని సీజన్లకు మార్కెట్‌లో ఉన్న బెట్టింగ్ యాప్‌లను లీజుకు తీసుకొని వాటి ఐడీ పాస్‌వర్డ్‌లు యువతకు ఇచ్చి ఆడించి సొమ్ములు సంపాదిస్తున్నారు. ఇప్పుడు కుమార్ జాతీయ స్థాయికి ఎదిగిపోవడంతో రెండు రాష్ట్రాల్లో ఫకీరే చక్రం తిప్పుతున్నాడు. ఈయన చుట్టూ నలుగురు యువకులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల మాదిరిగా వర్క్ ఫ్రం హోం చేస్తున్నట్టు ల్యాప్‌టాప్‌లు పట్టుకొని తిరుగుతుంటారు. ఇందులో ఒకరు కలెక్షన్లకు, మరొకరు మార్కెటింగ్‌కు, ఇంకొకరు ఐడీ పాస్‌వర్డ్ సమాచారం చేరవేసేందుకు.. ఇలా పని చేస్తున్నారు. బుకీగా వచ్చిన సొమ్ములో ప్రస్తుతానికి రూ.10 కోట్ల ఆస్తి ఒకప్పుడు బంగారం షాపులో పని చేసిన సేల్స్‌మెన్ సంపాదించాడంటే ఆశ్చర్యపోక తప్పదు. ఇక కేవలం బెట్టింగుల మీదే ఇదంతా సంపాదించాడా? అంటే ఫకీరుకు ఇంకో కోణం కూడా ఉంది.. పేకాడించడం. మరోవైపు వేరేవారు నడిపే శిబిరాలకు తన కస్టమర్లను పంపడం. సాధారణంగా వ్యాపారాలు, కంపెనీలు నిర్వహించేవారికే - మిగతా 4లో








రాష్ట్రంలో తిరుపతి లడ్డూ రాజకీయం నిజంగా చంద్రబాబు బుర్ర నుంచి పుట్టిందేనా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. సాధారణంగా బాబు ఒక స్కెచ్ వేస్తే, దాని నుంచి బయటపడటం ఎవరి తరం కాదు. ఇప్పుడు తిరుపతి లడ్డూలో యానిమల్ ఫ్యాట్ కలిసిందని చంద్రబాబు ఆరోపణలు చేయడం వల్ల ఇప్పటికిప్పుడు ఆయనకొచ్చిన ప్రయోజనం చూస్తే ఏమీ లేదు. మరో ఐదేళ్ల వరకు ఎన్నికలు లేవు. పోనీ స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఆయన ఈ దుమారం రేపారని అనుకున్నా, అది కూడా మరో 18 నెలల వరకు లేదు. ఒకవేళ ఉన్నా.. గతసారి మందిబలంతో ఏకగ్రీవం చేసుకున్న వైకాపా మాదిరిగానే తెలుగుదేశం కూటమి ఏకగ్రీవంగా పంచాయతీల నుంచి జిల్లాపరిషత్‌ల వరకు అధికారాలను కైవసం చేసుకోవడం ఇప్పుడున్న రాజకీయాల్లో కష్టమూ కాదు, జగన్మోహన్‌రెడ్డి లెక్క ప్రకారం తప్పకాదు. అటువంటప్పుడు చంద్రబాబు తమ ప్రభుత్వం వచ్చిన వంద రోజులకే ఇంత పెద్ద కుదుపును ఎందుకు తీసుకువచ్చారన్నదే ఇక్కడ మిలియన్ డాలర్ల ప్రశ్న. సోషల్ మీడియాలో గుర్రం సీతారాములు అభిప్రాయం ప్రకారం ప్రధాని మోడీ రాబోయే మూడు రాష్ట్రాల ఎన్నికల కోసం చంద్రబాబుకు లడ్డూసాయం అడిగినట్లు భావించాలి. హిందూ ఓటు పోలరైజ్ కోసం ఏకంగా అన్ని రాష్ట్రాల్లోనూ హిందువులు బీజేపీ వైపు నడిస్తే, ఈ మూడు రాష్ట్రాల ఎన్నికల్లో మోడీ గట్టెక్కుతారు. బహుశా అందుకోసమే చంద్రబాబు ఈ లడ్డూ కథను తెర మీదకు తెచ్చివుంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



# లడ్డూ కావాలా 'బాబు'!



**మూడు రాష్ట్రాల ఎన్నికల కోసమేనా? । దేశవ్యాప్తంగా ఏకమైన హిందువులు । మోడీ కోసం బాబు చేశారంటున్న సోషల్‌మీడియా**

### తడబడుతున్న చంద్రబాబు

చంద్రబాబు వెంటనే రంగంలోకి దుమికారు. పవిత్ర ప్రసాదంగా భావించే తిరుమల లడ్డులో పశువుల నెయ్యి కలిసిందని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి విచారణ చేయకుండా, వివాదం చేయడం ఈ ఎత్తుగడలో మొదటి భాగం. ఈ ప్రయత్నం ఇదే తొలిసారి కావడంతో కొంత తడబాటు తప్పలేదు. సాక్షాత్తూ తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) కార్యనిర్వహణ అధికారి (ఈఓ) నాణ్యత ప్రమాణాలు పాటించలేదని రెండు లోడ్ల నెయ్యిని వెనక్కి తిప్పి పంపేశామన్న మరునాడే ముఖ్యమంత్రి, ఆ నెయ్యి లడ్డూలకు వాడేశామన్నారు. ఆ ఆర్డరు పెట్టింది తమ ప్రభుత్వమేనని ఆయన చెప్పరు. నందిని నెయ్యి మంచిదని ఆయనే అంటారు, అంతకు ముందు నందిని నెయ్యిని తామే ఆపేశామని చెప్పరు. నాలుగొందలకు మంచి నెయ్యి ఎక్కడ దొరుకుతుందని ఆయనే అంటారు, తమ హయాంలో మూడు వందలకే కొన్న సంగతి చెప్పరు. అసలు తిరుమలలో ల్యాబ్ లేదని ఆయనే అంటారు, అక్కడ నాణ్యతను నిర్ధారించే ల్యాబ్ ఉందని, వచ్చిన ప్రతి లోడ్‌నూ మూడు పర్యాయాలు పరిశీలించి సంతృప్తి చెందాకనే వాహనాన్ని లోపలికి అనుమతిస్తారని చెప్పరు. ఇదివరలో నా రాష్ట్రంలోకి సిబిఐని అడుగు పెట్టనివ్వనని ఆర్డర్లు వేసిన నోటితో సిబిఐ విచారణకు ఆదేశించరు. దేశమంతా నిండివున్న వెంకన్నస్వామి భక్తుల అనుమానాలు తీరేదెన్నడు? మంగళవారం వేకువ జామున అనంతపురం జిల్లా కనేకల్లు మండలంలోని హనకనహల్ గ్రామంలో రాముడి గుడిలోని రథం అగ్నిప్రమాదానికి గురైంది. ఇదీ మంటను రాజెయ్యడం. ఇక ఒక్కొక్కటే ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రమాదాలు జరిపించే తుంటరులు ఎప్పటికీ పోలీసులకు చిక్కరు. అన్ని వేళ్లూ ఒకవైపే చూపిస్తుంటాయి. రాష్ట్రంలో మెజారిటీ పోలరైజేషన్ జరుగుతుంది. రాజకీయంగా మరెవరికో లాభం జరుగుతుంది. నష్టం రాష్ట్ర ప్రజల భవితకు.

### మార్క్స్ ఎప్పుడో ఊహించాడు

పెట్టుబడిదారుడు తనకు 20 శాతం లాభం వస్తుందంటే తన విస్తరణ కాంక్షను ఊరు సరిహద్దు దాటిస్తాడు. 50 శాతం లాభం వస్తుందంటే వాడ దాటుతాడు. 80 శాతం లాభం వస్తుందనుకుంటే రాష్ట్ర సరిహద్దులు దాటుతాడు. చివరకు తాను మరణిస్తే 100 శాతం లాభం వస్తుందని తెలిస్తే ఆ క్షణాన చంపడానికి చావడానికి ఆలోచించడని కార్ల్ మార్క్స్ 200 ఏళ్ల క్రితమే ఊహించాడు. అటువంటి వ్యాపారం జరుగుతున్న చోట నెయ్యిలో కల్తీలు కాక ఏముంటాయి? నెయ్యిని సరఫరా చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థను మార్చాలంటే కొత్త ప్రభుత్వం ఎటువంటి రాద్ధాంతం లేకుండా ఆ పని చేయొచ్చు. దేవస్థానంలో ఉన్న అధికారులను, బాధ్యులను లోపలెయ్యొచ్చు. వ్యాపారస్తుడు తన లాభం కోసమే బతుకుతాడు.. అది పాలైనా, పెరుగైనా, నెయ్యి అయినా. దేశం కోసం, ధర్మం కోసం కేవలం గడ్డి మాత్రమే తినే జంతువుల నుంచి పాలు పితికి నెయ్యి తియ్యాలి. అప్పటి వరకు ఏ నెయ్యి కొన్నా యానిమల్ ఫ్యాక్ కనిపిస్తునే ఉంటుంది.

### సమ్మతి సృష్టి

ఉత్తరప్రదేశ్‌లో గోమాంసం పట్టుకు వెళు_న్నాడనే అనుమానంతో పాతికమంది పెద్దలు పదహారేళ్ల ఇంటర్మీడియట్ కుర్రాడిని వెంబడించి హతమార్చారు. హత్యకు పాల్పడిన పాతికమంది యువకులు హిందువులనీ, హత్యకు గురైన ఆ యువకుడు ముస్లిం అనీ మనం ప్రస్తావించుకోనవసరం లేదు. మూకగా వెళ్లి చిన్న బృందాన్ని అనుమానం వస్తే చాలు చంపేయవచ్చున్నంత స్వేచ్ఛ లభించిన పాలన తీసుకువచ్చాం. అది అసలు తప్పు కాదన్న మనస్తత్వం మనకు ఈ పదేళ్లలో వచ్చేయడం ఉంది చూశారూ, అది గొప్ప విషయం! అదే ఉత్తరప్రదేశ్‌లో వ్యాపారాలు చేస్తున్న ప్రతి ఒక్కరూ తమ మతాన్ని దుకాణం బోర్డుల మీద రాయాలని ఆజ్ఞాపించారు.

### కొసమెరుపు

ఆంధ్రప్రదేశ్ రోజురోజుకు యుపికి చేరువవుతోందనే నమ్మకం మనకు కుదరాలంటే మన ఉప ముఖ్యమంత్రి ఎక్స్ (ట్విట్టర్) హ్యాండిల్ చూడాలి. కాస్త ఆలోచించే స్వభావమున్న ప్రకాష్‌రాజ్, కార్తీ లాంటివారు లడ్డు మీద చేసిన వ్యాఖ్యలకు ఈయన ఇచ్చిన సమాధానం: మాట్లాడితే మద్దతుగా మాట్లాడండి. లేకపోతే మౌనంగా కూర్చోండి. అపహాస్యం చేస్తే ప్రజలు క్షమించరు". ప్రజలు అంటే మెజారిటీ ప్రజలు! అదీ మ్యాటరు!!

**- సత్యం ఐటీ డెస్క్**

• ఎడిటోరియల్

# మసి పూసి మారేడుకాయ

మసిపూసి మారేడుకాయ చేయడంలో మోడీకి మించినవారు లేరని పదేళ్ల నుంచి రుజువవుతూనే ఉంది. ఇందుకు మరో తాజా ఉదాహరణే సోమనాథన్ కమిటీ సిఫార్సు చేసిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్). చూడటానికి నున్నగా కనిపిస్తున్నా కరిమింగిన వెలగపండు చందమే ఈ స్కీమ్. ముప్పై ఏళ్లు వివిధ ప్రభుత్వ విభాగాల్లో సేవలందించి, పదవీ విరమణ తర్వాత వారి జీవితానికి, కుటుంబానికి ఓ భరోసానే పెన్షన్. ఈ పెన్షన్ పొందడం వారి హక్కే కానీ, భిక్ష కాదని సుప్రీంకోర్టు ఏనాడో తేల్చి చెప్పింది. అన్నీ ఇస్తామంటూనే ఉద్యోగి నుంచి వాటా అడుగుతున్నారు. అందుకే ఈ ఏకీకృత టెన్షన్ పథకాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ విధానంలోని అనేక అంశాల్లో అసలు స్పష్టతే లేదు. ఉద్యోగుల భాగస్వామ్య వాటా ఎందుకు? ఈ స్కీం భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు సృష్టించడం ఖాయం. వాస్తవానికి 2004 ముందు వరకు ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీం) అమల్లో ఉండేది. దీన్ని ట్రిబుల్ బెనిఫిట్స్ సిస్టమ్ అనేవారు. అంటే కచ్చితమైన పెన్షన్, పీఎఫ్, గ్రాడ్యూటీ.. ఈ మూడూ పదవీ విరమణ పొందిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి వర్తించేవి. ఉద్యోగుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకునేవారు కాదు. అయితే ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు వాజ్‌పేయి నాయకత్వంలోని అప్పటి ఎన్డీయే ప్రభుత్వం జవనరి, 2004 నుంచి జాతీయ పెన్షన్ విధానం తీసుకొచ్చింది. ఈ విధానం తర్వాత సర్వీస్‌లో ఉన్నప్పుడే పెన్షన్ ఫండ్ కోసం ఉద్యోగి నుండి పది శాతం, యాజమాన్యం నుంచి పది శాతం తీసుకొని షేర్‌మార్కెట్లో పెట్టడం మొదలుపెట్టారు. మార్కెట్ హెచ్చుతగ్గులను బట్టి ఉద్యోగి రిటైర్ అయినపుడు, చనిపోయినపుడు ఎంత అయితే అతని అకౌంట్లో ఉంటుందో అందులో అరవై శాతం చేతికిస్తారు. మిగిలింది మ్యూచ్‌వల్ ఫండ్స్ వలె కొనుక్కోవాలి. అయితే ఇందులో పెన్షన్ ఎంత వస్తుందో స్పష్టత ఉండదు. మార్కెట్‌ను బట్టి మారిపోతూ ఉంటుంది. 2004 తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారందరికీ ఈ విధానం అమల్లో ఉంది. ఈ విధానానికి వ్యతిరేకంగా ఓపీఎస్ అమలుచేయాలని ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి తలొగ్గి 2023, మార్చిలో బీజేపీ ప్రభుత్వం సోమనాథన్ కమిటీని నియమించింది. ఏడాది తర్వాత దీని సిఫారసుల మేరకు యూనిఫైడ్ పెన్షన్స్ స్కీంను 2024 ఆగస్టు 24న కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. దీని ప్రకారం పెన్షన్ కమ్యూటేషన్, కనీసం ఐదేళ్లకు ఓసారి పెన్షన్ సవరణ, టాక్స్ బెనిఫిట్స్, 70 ఏండ్ల పైబడిన వారికి అదనపు పెన్షన్ అంటూ అనేక అంశాలు వివరించారు. షేర్‌మార్కెట్‌పై ఆధారపడకుండా ఫిక్స్‌డ్‌గా కొంత పెన్షన్ కూడా ఇస్తామంటున్నారు. ఇవన్నీ పాత పెన్షన్ వలె పైకి కనపడుతున్నా ఉద్యోగి భాగస్వామ్యం మాత్రం అలాగే కొనసాగుతుంది. అలాగే ఓపీఎస్ కింద 20 ఏళ్ల సర్వీసుంటే పూర్తి పెన్షన్ వచ్చేది. యూపీఎస్‌లో దాన్ని పాతికేళ్లు చేశారు. దీనివల్ల పెన్షన్‌కు అర్హత పొందే వారి సంఖ్య తగ్గిపోయే అవకాశముంది. పైగా ఉద్యోగి సర్వీస్‌లో ఉన్నన్ని రోజులు పెన్షన్ ఫండ్ మొత్తం షేర్‌మార్కెట్లోనే పెడతారు. అంటే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం షేర్ మార్కెట్‌కు నిధులు సమకూర్చటమే. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం తన వాటాను మరో నాలుగున్నర శాతం పెంచింది. జూలై 31 నాటికి ఎన్‌పీఎస్ కింద ఉన్న 99,77,165 మంది ఉద్యోగులకు చెందిన రూ.10,53,850 కోట్ల పెన్షన్ నిధులను షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడానికే బీజేపీ ఈ నిర్ణయం తీసుకుందనేది స్పష్టం. ప్రభుత్వానికి ఉద్యోగుల బాగుకన్నా కార్పొరేట్ల అవసరాలే ముఖ్యమని దీన్ని బట్టి అర్థమవుతోంది. ఈ విధానంలో చెప్పిన పదవీ విరమణ సమయంలో చెల్లించే మొత్తం, అదనపు పెన్షన్, ఆరోగ్య కార్డులు, భవిష్యత్తులో సవరణలు, పన్ను ప్రయోజనాలు వంటి అంశాలపై అసలు స్పష్టతే లేదు. ప్రస్తుతం జమ్మూకాశ్మీర్, హర్యానాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ తర్వాత కీలకమైన మహారాష్ట్ర, జార్ఖండ్, బీహార్, ఢిల్లీలలో వరుసగా ఎన్నికలున్నాయి. ఎన్నికల్లో ప్రధాన అంశంగా పాత పెన్షన్ పునరుద్ధరణను కాంగ్రెస్ ఎంచుకున్నది. అందుకే బీజేపీ ఈ స్కీమును హడావిడిగా ఆమోదించింది. ఈ స్కీమును జాతీయ ట్రేడ్ యూనియన్లలో బీఎంఎస్ తప్ప మిగిలిన అన్ని సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రం యూపీఎస్‌ను తెరపైకి తెచ్చి ఉద్యోగులను తప్పు దోవ పట్టిస్తోందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సంస్థ 'ది నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్' ఈ పాటికే ప్రకటించింది. ఏది ఏమైనా ఈ పెన్షన్ పథకం ఉద్యోగులను ఏమారుస్తోందనేది స్పష్టం. ఇలాంటి మసిపూసి మారేడుకాయ చేసే పనులకు కేంద్రం పూనుకోవడం మానాలి. ఉద్యోగులు మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేరు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు పాత పెన్షన్ విధానం కోసం తమ ఉద్యమాన్ని కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు.

# ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డే!

- అమ్మ మొక్కుకై కాలిబాట పట్టిన ప్రొఫెసర్ దంపతులు -





నాసిక్ హైవే మీద.. రోడ్డు మీద వెళుతున్న జనాల వంక ఆసక్తిగా చూస్తున్న ఒక వృద్ధ జంటను చూసాను. చూడ్డానికి వాళ్లు చాలా పేదవారిలా, ఏదో అవసరంలో ఉన్నవారిలా అనిపించింది. నేను వారికి ఆహారం కానీ, మరేదైనా సహాయం కావాలా అని అడిగి వారు మొహమాట పడుతుంటే, ఒక వంద రూపాయల నోటు ఇస్తే వాళ్లు నిరాకరించారు. నేను వాళ్ల గురించి అడిగితే వాళ్లు చెప్పిన విషయం విని నా మతి పోయింది.

వాళ్లు 2,200 కిలోమీటర్ల దూరాన్ని మూడు నెలల్లో కాలినడకన పూర్తి చేసి ద్వారకకు తిరుగు ప్రయాణం చేస్తున్నారట. ఇల్లు చేరడానికి మరొక నెల పడుతుందట.

అలా ఎందుకు నడవడం అని నేనడిగిన ప్రశ్నకు ఆయన జవాబేంటంటే..?

నా చిన్నప్పుడు నా రెండు కళ్లలోని చూపు పోతే, మా అమ్మ డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లింది. కానీ, అక్కడి డాక్టర్లు, ప్రపంచంలోని ఏ గొప్ప డాక్టరు కూడా కళ్లు తెప్పించలేడని చెప్పారట. అయినా, వాళ్లమ్మ పట్టుబట్టి ఆపరేషన్ చేయమని, ఫలితం భగవంతునికి వదిలేద్దామని చెప్పిందట. అంతేగాక, తన కొడుకుకు కంటి చూపు వస్తే, కొడుకుని కాలి నడకన పండరిపూర్, తిరుపతికి యాత్రకు పంపిస్తానని మొక్కుకున్నదట. అతనికి చూపు వచ్చిందట. అందుకని ఆ కొడుకు కాలి నడకన, అమ్మ కోరిక ప్రకారం యాత్ర పూర్తి చేసి, తిరుగు ప్రయాణంలో ద్వారకకు బయల్దేరారట.

కానీ, మరి ఆ స్త్రీ ఎందుకు ప్రయాణం చేస్తుందనే ఆసక్తితో అడిగితే..?

'నా భర్త ఒంటరిగా అంత దూరం కాలి నడకన వెళ్లడం ఇష్టం లేక, దారిలో ఆయనకు అన్నపానీయాలు అమరుస్తూ, ప్రయాణంలో ముచ్చటించుకుంటూ సరదాగా గడపవచ్చని నడుస్తున్నానని' చెప్పింది.

వాళ్ళిద్దరూ చక్కటి హిందీ, ఇంగ్లీషుల్లో మాట్లాడడం చూసి వారి చదువు గురించి ప్రశ్నించిన నాకు వారు చెప్పిన సమాధానం విని మతిపోయింది.

ఆ మగ వ్యక్తి ఆస్ట్రో ఫిజిక్స్‌లో పీహెచ్డీ చేసి లండన్‌లోని ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంలో ఏడేళ్లు సి.రంగరాజన్, కల్పనా చావ్లాతో కలిసి పనిచేసాడట. అతని భార్య లండనులోని ఒక విశ్వవిద్యాలయం నుంచి హ్యూమన్ సైకాలజీలో పీహెచ్డీ చేసిందని చెప్పేసరికి నాకు మూర్ఛ వచ్చినంత పనైంది. వాళ్ల ముఖాల్లో అంత చదువుకున్నామనే, అంత గొప్పవారమనే ఛాయలు కనిపించడమే లేదు. వాళ్లు చెప్పిన మరొక విషయం కూడా నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. వాళ్లకు వచ్చే పెన్షన్ మొత్తం అంధులకు సహాయంచేసే, ఒక ట్రస్టుకు విరాళంగా ఇస్తున్నారట.

అతని పేరు డాక్టర్ దేవ్ ఉపాధ్యాయ. ఆమె పేరు డాక్టర్ సరోజ్ ఉపాధ్యాయ. తల్లి మొక్కును ఇప్పటికైనా తీర్చిన వాళ్లిద్దరూ ధన్యులు. ఇది కదా మన దేశపు ఔన్నత్యం!

- గణేష్ తోట

# ఎండీయూ ఆపరేటర్లకు అండగా ఉంటా: మామిడి



(సత్యంన్యూస్, పాతపట్నం)

ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగమైన ఎండీయూ వ్యవస్థను కొత్తగా వచ్చిన సర్కార్ ఉంచాలా లేక మార్పులు చేయాలా అనే పలు ఆలోచనలు చేసిన నేపథ్యంలో ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యులంతా ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలను అందజేస్తున్నారు. ఈ క్రమంలో పాతపట్నం ఎమ్మెల్యేకు కూడా వినతి పత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం తీసుకున్న మామిడి సానుకూలంగా స్పందిస్తూ ఎండీయూలకు తనవంతుగా న్యాయం చేస్తానని, ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ఆపరేటర్లకు తన వలన ఏలాంటి నష్టం లేకుండా చూస్తానని చెప్పారు. అవసరమైతే ఆర్థిక సాయం అందించి వారికి అండగా నిలుస్తానన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన వారిలో పాతపట్నం నియోజకవర్గం ఎండీయూ ఆపరేటర్లు పాతపట్నం, మెళియాపుట్టి, హిర మండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండల ప్రెసిడెంట్లు అనిల్, సాయిరాజ్, శ్రీనివాస్, వాసు, నవీన్, ఆమదాలవలస మండలం రెసిడెన్స్ వరహాల నరసింహులు, మోహన్, నియోజకవర్గ ఆపరేటర్లు పాల్గొన్నారు.






# బూజు పట్టిన ఇంట్లో సావిత్రి 5 ఏళ్ల పాపలా ముడిచుకుపోయి!



వెండితెర వెలుగు మహానటి సావిత్రి ప్రస్థానం గురించి చెప్పేదేముంది. 300కు పైగా చిత్రాల్లో నటించిన లెజెండరీ నటి. మూడు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో సంచలనాలు నమోదు చేసారు. ఆమె చేయనటి వంటి పాత్రలేదు. పాత్రకే వన్న తీసుకొచ్చిన గొప్ప మహానటి. నటిగా దేశ వ్యాప్తంగా ఎంతోఫేమస్. గొప్ప సేవాదృక్పథం గల నటి. సహాయం అంటూ ఆమె ఇంటి గుమ్మం తొక్కితే దొరకని సహాయం అంటూ ఉండేది కాదు. అలా ఎంతో మందికి సాయం అందించిన చేయి ఆమెది. డబ్బు కాదు.. మనుషులు మాత్రమే శాశ్వతం అని నమ్మిన నటి. అలాంటి లెజెండరీ నటి చివరి జీవితం ఎంతో దుర్భరంగా సాగిందని అంతా చెప్పుకుంటారు. తాజాగా ప్రముఖ నటి సులక్షణ ఓ ఇంటర్వ్యూలో సావిత్రి గురించి మరిన్ని విషయాలు పంచుకున్నారు. డాలీ పేరుతో బాలనటిగా 100కి పైగా సినిమాలు చేశారు సులక్షణ. సులక్షణ పేరు చెప్పగానే అందరికీ "శుభోదయం" గుర్తొస్తుంది.

తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లోనూ సినిమాలు చేసారు. ప్రస్తుతం ఆమె చెన్నైలో నివాసం ఉంటున్నారు. బాలనటిగా అప్పటి స్టార్ హీరోయిన్స్ అందరితో కలిసి నటించాను. వాళ్లంతా నన్ను ఎంతో గారాబంగా చూసుకునేవారు. అలా ఎస్వీఆర్, సావిత్రిగారితో వారితో మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. సావిత్రి గారి చివరి రోజులలో ఆమెను చూడాలనిపించింది. ఆమెను చూడాలని ఉందని జెమినీ గణేశన్ గారిని అడిగాను. అడ్రస్ కనుక్కుని సావిత్రి గారి ఇంటికి వెళ్లాను.

అది ఒక పాత ఇల్లు. బూజులు పట్టి ఉంది. ఫ్యాన్ కూడా లేదు. సావిత్రిగారు మనలో లేరు. ఆమె చాలా భారీ మనిషి. అలాంటి ఆమె ఐదేళ్ల పాపలా ముడుచుకుపోయి ఉన్నారు. ఆమె ఒళ్లంతా ట్యూబ్స్ పెట్టారు. చాలా నల్లగా అయిపోయారు. ఆమెను చూసుకోవడానికి అక్కడ ఒక మనిషి ఉన్నారు. ఆ స్థితిలో నేను సావిత్రి గారిని చూడలేకపోయాను. ఎంతోమందికి ఎన్నో దానధర్మాలు చేసిన ఆమెను అలా చూసి తట్టుకోలే కపోయాను. ఆమెకి ఇలాంటి పరిస్థితి వచ్చిందేంటని చలించిపోయాను. కానీ సావిత్రి గారు చేసిన దానధర్మాలతో తప్పకుండా స్వర్గానికే వెళతారు..అని అన్నారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

గ్లామరస్ బ్యూటీ కృతి శెట్టి తన మొదటి సినిమాతోనే టాలీవుడ్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఉప్పెన సినిమా ద్వారా యూత్‌లో ఫేవరెట్ హీరోయిన్‌గా మారిన కృతి, ఆ తర్వాత వరుసగా మంచి అవకాశాలు అందుకుంది. కానీ, ఆ సినిమాల ఫలితాలు అనుకున్నంత స్థాయిలో లేకపోవడంతో కెరీర్‌లో కొంత తగ్గుదల కనిపించింది. ఉప్పెన తర్వాత నాని తో చేసిన శ్యామ్ సింగరాయ్, నాగ చైతన్య తో చేసిన బంగార్రాజు సినిమాలు సక్సెస్ సాధించినా, ఆ తర్వాత వచ్చిన మాచర్ల నియోజకవర్గం, వారియర్, కస్టడీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. అయితే, సినిమాల పరంగా వచ్చిన ఈ కష్టాలను పక్కన పెడితే, కృతి శెట్టి సోషల్ మీడియాలో మాత్రం పూర్తిగా తన క్రేజ్‌ను నిలబెట్టుకుంది. ఇటీవల తన గ్లామర్ ఫోటోషూట్స్‌తో ప్రేక్షకులను, అభిమానులను ఆకట్టుకుంటూ వస్తోంది. పలు స్టైలిష్ ఔట్‌ఫిట్స్‌లో కృతి తన గ్లామర్‌ను నూతన పంథాలో చూపిస్తూ ఫ్యాషన్ లవర్స్‌ని, యూత్‌ని ఎంతగానో ఆకర్షిస్తోంది.



# చీరలో ఉప్పెన పాప!!

తాజాగా కృతి, పింక్ కలర్ చీరలో కనువిందు చేస్తూ, ఫ్యాన్స్ హృదయాలను దోచుకుంటోంది. ఆమె బాడీ లాంగ్వేజ్, సున్నితమైన నడుము, చిరునవ్వుతో ఫోటోలో మరింత గ్లామర్‌ను మెరిసేలా చేస్తోంది. సోషల్ మీడియాలో ఆమె షేర్ చేస్తున్న ప్రతి ఫోటో వైరల్ అవుతూ, అభిమానుల నుంచి మంచి స్పందనను రాబడుతోంది. కృతి పిక్స్‌కు నెటిజన్లు "బేబమ్మ అదుర్స్", "సూపర్ గ్లామర్" అంటూ కామెంట్లతో ప్రేమను చాటుతున్నారు. ఇప్పటికే తమిళ, మలయాళ చిత్రాల్లో పలు ప్రాజెక్ట్స్‌లో బిజీగా ఉన్న కృతి, తెలుగు సినిమాల్లో తిరిగి అవకాశాలను అందుకునేందుకు ప్రయత్నిస్తుంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# కొరటాల క్లారిటీ.. ఇక మెగా ఫ్యాన్సే తగ్గాలి



తమ అభిమాన హీరో సినిమా ఫ్లాప్ అయితే ఫ్యాన్స్ తట్టుకోలేరు. ఆ సినిమా తీసిన దర్శకుడ్ని టార్గెట్ చేయడం, తప్పుల్ని ఎత్తి చూపడం చాలా కామన్. 'ఆచార్య' విషయంలో అదే జరిగింది. ఆ మాట కొస్తే.. ఇంకాస్త ఎక్కువ జరిగింది. చిరంజీవి, రామ్ చరణ్ కలిసి నటించిన 'ఆచార్య' డిజాస్టర్ అవ్వడం మెగా ఫ్యాన్స్ తట్టుకోలేకపోయారు. ఆ తరవాత కొరటాలపై వచ్చిన ట్రోలింగ్ గురించి అందరికీ తెలిసిందే. చిరు, చరణ్‌లు తన పని తనని చేసుకోనివ్వలేదని కొరటాల చాలామంది దగ్గర వాపోయినట్టు వార్తలొచ్చాయి. ఈమధ్య ఇంటర్వ్యూలో కూడా నర్మగర్భంగా ఇలాంటి కామెంట్లే చేశాడు కొరటాల. ఎవరి పని వాళ్లు చేసుకొంటే బాగుంటుందని, మరొకరి పనిలో వేలు పెడితేనే సమస్యలు వస్తాయని చేసిన వ్యాఖ్యలు ఇంకాస్త దుమారం రేపాయి. చిరుని ఉద్దేశించే కొరటాల ఈ కామెంట్లు చేశాడని మెగా ఫ్యాన్స్ అభిప్రాయ పడ్డారు. ఆ తరవాత కొరటాలపై ఓ రేంజ్‌లో ట్రోలింగ్ మొదలెట్టారు. తాజా ఇంటర్వ్యూలో చిరు గురించి కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు కొరటాల. చిరంజీవితో తనకు మంచి సంబంధాలే ఉన్నాయని, దేవర సినిమాతో బౌన్స్ బ్యాక్ అవుతావని ఆయన ఆశీర్వదించారని చెప్పుకొచ్చాడు. దీంతో చిరు–కొరటాల మధ్య ఉన్న ఇష్యూస్‌కి తెర పడినట్టే. చిరు కూడా ఓ ఫ్లాప్ ఇచ్చాడని తన దర్శకుల్ని ఇబ్బంది పెట్టే రకం కాదు. చిత్రసీమలో హిట్లూ, ఫ్లాపులూ మామూలే. దశాబ్దాలుగా చిత్రసీమలో ఉన్న చిరుకి ఇది తెలియని విషయం కాదు. కాకపోతే.."ఆచార్య" ఫ్లాపు నుంచి మెగా అభిమానులే తేరుకోలేకపోతున్నారు. కొరటాల ఏం మాట్లాడినా, దానికి నానార్థాలు తీస్తున్నారు. కొరటాల తన మనసులో ఉన్నది చెప్పేశాడు కాబట్టి, మెగా ఫ్యాన్స్ కూడా కాస్త తగ్గితే, తమ వైపు నుంచి ట్రోలింగ్ ఆపితే బాగుంటుంది. ఈ వివాదానికి శాశ్వతంగా ఫుల్‌స్టాప్ పెట్టినట్టు ఉంటుంది.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

# పేజర్లు అయిపోయాయి.. ఇప్పుడు ఐ-ఫోన్లు



లెబనాన్, సిరియాలలో ఎంతమంది ఉగ్రవాదులు చనిపోయారన్నది కచ్చితమైన రిపోర్టులు లేవు. ఐఫోన్‌లు కూడా పేలినట్లుగా తెలుస్తోంది. తక్కువ ధరకి ఐఫోన్ వస్తే ఎవరు కొనకుండా ఉండగలరు? తక్కువ ధరకి ఎవరు ఎందుకు అమ్ముతున్నారో తెలుసుకోవాలి కదా? ఐఫోన్ అనేది భద్రత విషయంలో చాలా ఉన్నత ప్రమాణాలు కలిగి ఉంటుంది అని ప్రచారంలో ఉంది. అఫ్కోర్స్! ఐఫోన్ మొదటిసారిగా 2007లో మార్కెట్లోకి వచ్చినప్పుడు దాని ఓఎస్ చాలా పటిష్టంగా ఉంది అని నిపుణులు చెప్పారు. 2015లో మొదటిసారిగా ఒక హ్యాకర్ ఆపిల్ స్టోర్‌లోకి చొచ్చుకువెళ్లి ఐస్టోర్‌లో ఉన్న ఐట్యూన్స్‌ను ఉచితంగా డౌన్లోడ్ చేసుకునే విధంగా మార్చేశాడు! అక్కడితో ఆగకుండా ఐమాక్, ఐఫోన్ యాక్ససరీస్ ధరలని అన్నిటిని ఒక డాలర్ కింద మార్చేశాడు. తర్వాత కొద్ది గంటల్లలోనే యాపిల్ తన రక్షణ వ్యవస్థని సరిచేసుకుంది.

సమాచార విప్లవంలో యూదుల పాత్ర తిరుగులేనిది! కాబట్టి కంపెనీ, బ్రాండ్ అనేవి మార్కెటింగ్‌కి సంబంధించినది! టెక్నాలజీ యూదుల చేతిలో ఉంటూ వచ్చింది, ఇక ముందు కూడా ఉంటుంది! తప్పించుకోవడం కష్టం! చైనాకి ఈ విషయం తెలుసు కాబట్టి హైవాయుని జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నది!

పేలిపోయిన పేజర్లు, స్మార్ట్ ఫోన్ల నుండి డాటాని రిట్రీవ్ చేసిన మోస్సాద్ హెజ్బొల్లా అంతర్గత రహస్య డాక్యుమెంట్‌ని కనుక్కుంది. డాటాలో ఎంతమంది ఎలా గాయపడ్డారు, చనిపోయారో వివరాలు ఉన్నాయి. ఈ డాక్యుమెంట్‌ని హెజ్బొల్లా మిలిటరీ ఇంటెలిజెన్స్ యూనిట్ ప్రిపేర్ చేసినట్లుగా తెలుస్తున్నది! మొత్తం 879 మంది పేజర్లు, వాకీటాకీలు పేలిపోవడం వల్ల మరణించారు. చనిపోయిన వారిలో 131 మంది ఇరాన్ దేశంకి చెందిన వాళ్ళు, 79 మంది యెమెన్ దేశానికి చెందిన వాళ్ళు, 291 మంది హెజ్బొల్లా సీనియర్ ఆఫీసర్లు! తీవ్రంగా గాయపడిన వారు 602 మంది. వీళ్లు తమ పనులు తాము చేసుకోలేని విధంగా గాయపడ్డారు కాబట్టి మరణించిన వారితో సమానం. కళ్ళు కోల్పోయినవారు 509 మంది. జననేంద్రియాలు కోల్పోయినవారు 1735 మంది.

ట్రోజాన్ హార్స్‌ని ఉపయోగించి ఇంతమందిని ఎలిమినేట్ చేయడం ఇదే మొదటిసారి! ఇక లాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్ కంప్యూటర్లు పేలడానికి సిద్ధంగా ఎన్ని ఉన్నాయో తెలీదు. హెజ్బొల్లా దగ్గర ఉన్న వీటిని ఆన్ చేయగానే మోస్సాద్‌కి తెలిసిపోతుంది కాబట్టి వాటిని ఇకముందు ఆన్ చేయబోరు. పోనీ ట్రోజాన్ హార్స్‌ని రిమూవ్ చేసే టూల్స్‌తో దానిని తీసేయాలి అంటే ముందు అది ఎలా పనిచేస్తుందో, దాని పేరు ఏమిటో దానిని రిమూవ్ చేసే టూల్ డాటాబేస్‌లో ఉండాలి కానీ అది ఉండదు. సాధారణంగా ట్రోజాన్ హార్స్ రిమూవ్ చేసే టూల్స్ ఉచితంగా దొరుకుతాయి కానీ మోస్సాద్ క్రియేట్ చేసిన ట్రోజాన్‌కి పేరు ఉండదు. ఏదన్నా యాంటీవైరస్ సంస్థ పరిశోధన చేసి దానికి పేరు పెట్టి రిమూవ్ చేసే టూల్ డేటా బేస్‌ని క్రియేట్ చేయాలి. ఒక్కరి కోసం ఏ సంస్థ కూడా ఆ పని చేయదు. ఒకవేళ హెజ్బొల్లా పెద్ద మొత్తంలో డబ్బు ఆశ చూపినా ఆ విషయం మోస్సాద్‌కి తెలిసిపోతుంది! ఒక్క మాటలో చెప్పాలి అంటే కంప్యూటర్‌లు విస్తృతంగా వాడుకలోకి రావడం మొదలైన కొత్తల్లో వైరస్‌లను సృష్టించి, వాటికి విరుగుడుగా యాంటీవైరస్ కంపెనీలు అభివృద్ధి చెందడానికి కారకులు యూదులు! కట్ చేస్తే యాంటీవైరస్ బిజినెస్ అనేది ఇప్పుడు 5 బిలియన్ డాలర్ల వ్యాపారం! ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్ అయ్యారు?

**- పొట్లూరి పార్థసారధి**

## నిస్వార్థమే సేవే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

- ఎమ్మెల్యే గొండు శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిస్వార్థమే సేవే లక్ష్యంగా (జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ) ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడ్యుకేషన్ ద్వారా సర్వీస్ అంటూ విద్యార్థుల్లో చదువు, విజ్ఞానంతోపాటు సమాజం పట్ల బాధ్యతను, సమస్యల పట్ల అవగాహనను పెంపొందిస్తూ విద్యార్థుల సమగ్ర మూర్తిమత్వానికి, మంచి క్రమశిక్షణకి దారి చూపిస్తూ ప్రజా హృదయపథంలో పయనించే ఆ రథమే జాతీయ సేవా పథకం అన్నారు. సెప్టెంబర్ 24 ఎన్ఎస్ఎస్ డే జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ముందుగా కళాశాలలో ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాల నిర్వహణలో లోపాలుంటే క్షమించం

(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)

అక్టోబర్1 నుంచి 3వరకు నిర్వహించనున్న స్థానిక కొత్తమ్మతల్లి ఉత్సవ జాతరలో ఎటువంటి లోపాలు కనిపించిన సంబంధిత అధికారులపై చర్యలు తీవ్రంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఎస్పీ కె.వి. మహేశ్వరెడ్డి, జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌లతో కలిసి కొత్తమ్మతల్లి ఆలయాన్ని సందర్శించారు. ముందుగా కొత్తమ్మతల్లిని దర్శించుకొని స్థానికులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. గాలిగోపురం మరమ్మత్తులు, ఆలయానికి రంగులు త్వరితగతిన పూర్తిచేయాలని, వాహన పార్కింగ్‌లు, సాంస్కృతిక, సాంఘిక కార్యక్రమాలు నిర్వహించే స్థలాలను, పోలీస్, రెవెన్యూ సంయుక్తంగా పరిశీలించి ఎవ్వరికి ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నిచోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అమ్మవారికి రెండుమీటర్లు పొడవునా రేకుషెడ్లు నిర్మాణం చేపట్టాలని సూచించారు. కొత్తపేట నుంచి కోటబొమ్మాళి చివరి వరకు విద్యుత్ అలంకరణ, అవసరం ఉన్న చోట సీసీ కెమెరాలు, బయో టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని అదికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గడ్డెమ్మ, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, తహసీల్దార్ అప్పలరాజు, ఆలయ ఈవో రాధాక్రిష్ణ, టీడీపీ మండల పార్టీ అద్యక్షుడు బోయిన రమేష్ తదితరులు ఉన్నారు.



## భగత్‌సింగ్, గాంధీ జయంతి వారోత్సవాలను జయప్రదం చేయండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారత స్వాతంత్రోద్యమంలో ముఖ్యంగా పాత్రను పోషించిన భగత్ సింగ్ మహాత్మా గాంధీ జయంతి వారోత్సవాలు ఈనెల 25 నుండి అక్టోబర్ 2వరకు నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి చందు బి హరీష్ ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా నాయకుల వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి విద్యా విధానంలో కార్పొరేటీకరణ అధిక విద్యా ఒత్తిడి వల్ల విద్యార్థులు గంజాయి మత్తు పదార్థాలకు ఎంతగానో అలవాటు పడుతున్నారని, ఈ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకే మరింత చైతన్యవంత పరిచేందుకు, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ఎస్ఎఫ్ఐ కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల మందు సిగరెట్టు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అవసరమైతే జిల్లా పోలీస్ శాఖ కూడా ఇందులో భాగస్వామ్యం చేసి విద్యార్థులను మరింత చైతన్య పరుస్తామని చెప్పారు. అలాగే జిల్లా స్థాయిలో వ్యాసరచన చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. నేటి విద్యావిధానంలో విద్యా కాషాయకరణ జరుగుతున్న నేపథ్యంలో స్వాతంత్ర సమరయోధులు అయిన భగత్‌సింగ్ రాజు గురు సుఖదేవ్ మహాత్మాగాంధీ లాంటి స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రల స్థానంలో మతోన్మాద శక్తులైనటువంటి ఆర్ఎస్ఎస్ పాఠాలను చేర్చే ఇప్పటికే విద్యను కాషాయకరణ చేసినటువంటి ప్రభుత్వ వైఖరిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం సంతోష్, ఉపాధ్యక్షులు సిహెచ్ రాజు, నాయకులు ఖగేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ భారత్‌లో భాగస్వామ్యం అవుదాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన దేశ అభివృద్ధి లక్ష్యసాధనలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ భారత్‌లో ప్రతి ఒక్కరం భాగస్వామ్యం అవుదామని జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా బుధవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం పుష్కరణి ఆవరణలో, ఇతర ప్రాంతాల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నారాయణరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబరు 2వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా యువక్లబ్ విద్యార్థిని విద్యార్థులతో పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతీ ఒక్కరికి పచ్చదనం-పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, నీటి వినియోగం, స్వచ్ఛ సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ జ్యోతిర్మయి, శర్వాణి విద్యానికేతన్ సిబ్బంది, డి రమేష్ పాల్గొన్నారు మరియు అరసవల సిబ్బంది పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాలపై అవగాహన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఎచ్చెర్ల, జి.సిగడాం, గార, ఆమదాలవలస, హిరమండలం, మెళియాపుట్టి, టెక్కలి, మహిళ పోలీసుస్టేషన్లు గల పోలీసు అధికారులు సిబ్బందితో వారి పరిధిలో ఉన్న కళాశాలలు, పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ప్రస్తుత సమాజంలో మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డ్రగ్స్ వినియోగానికి చాల దూరంగా ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు, వ్యసనాలకు స్వస్తి చెప్పి చదువుపై శ్రద్ధ వహించి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. దీంతోపాటు మైనర్ డ్రైవింగ్ చేయడం చట్ట ప్రకారం నేరమని, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు.



## తుఫాన్ బాధితులకు డీసీసీబీ ఉద్యోగులు ఆర్థికసాయం



(సత్యంన్యూస్, టెక్కలి)

విజయవాడ వరద బాధితులకు డీసీసీబీ ఉద్యోగులు ఆర్థిక సాయం అందజేశారు. ఈమేరకు మంగళవారం మూలపేటలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఉద్యోగులు తమ ఒకరోజు వేతనంగా వచ్చిన రూ. 5,02,846/- చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇటువంటి సహాయం అందజేయడం చాలా అవసరమన్నారు. విరాళం అందజేసిన బ్యాంకు ఉద్యోగులను అభినందించారు. సీఈవో వరప్రసాద్, జిఎం జగదీష్,, డీజీఎం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన డైరెక్టర్

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఫెన్సింగ్ తైక్వాండో పోటీలో ఉత్తమ ప్రదర్శన కనపరచిన పల్లవి, సాయి తారక్‌కు అభినందించిన డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ బుధవారం అభినందించారు. పియుసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈ విద్యార్థులు ఈనెల 23న శ్రీకాకుళం జరిగిన ఎస్జిఎఫ్ ఫెన్సింగ్ తైక్వాండో పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఇంకా ఉన్నతమైనస్థాయికి చేరుకొని మరిన్ని విజయాలు సాధించి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. ఐఐఐటి ఫిజికల్ ఎడ్యుకేషన్ విబాగం శిక్షకులు రాజు, దిలీప్‌కుమార్, విద్యార్థులకు మంచి శిక్షణ అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ మోహనరావు, డీన్ వెల్ఫేర్ గేదెల రవి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం రాజు, దిలీప్‌లు పాల్గొన్నారు.



## 29న సహకార స్టోర్స్ మహాజన సభ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ ఉద్యోగుల సహకార స్టోర్స్ మహాజనసభ ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు మేనేజర్ జి.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 29న ఉదయం 10.30 గంటలకు నగరంలోని బొందిలిపురంలోగల సంఘం కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి అర్హులు కలిగిన ప్రతి ఒక్క సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విజిలెన్స్ ఎస్పీగా నియమితులైన స్వీకరించిన బర్ల ప్రసాద్ మంగళవారం పలాస శాసన సభ్యులు గౌత శిరీషను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

– సత్యంన్యూస్, పలాస




YOUR TRUSTED PARTNER IN THE DISTANCE EDUCATION SECTOR.
SriAaKaSa
Join our Earn while Learn program and get a job within 40 days after joining.
LAST DATE: AUGUST-28
91330 06999 Courses 92466 36411
10th, Intermediate
BA (all groups), B.Com, BLISc, B.SC (all groups),
BBA, BCA (with Market trending specialisations)
MA (all subjects), M. Com, MBA, MCA,
M. SC (All Subjects), MLISc, M.Tech
Computer Applications, Cyber Security, Digital Marketing,
Hospital Management, Tourism Management

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ పాలీసీట్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

MNM
బెంగుళూర్ అయ్యంగార్
బేకరి
BSNL ఆఫీస్ ప్రక్కన, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
సెల్: 76759 18522

పేపర్ బాయ్స్
కావలెను
సంచలన సాయంకాల పత్రిక 'సత్యం'లో పని చేసేందుకు పేపర్‌బాయ్స్ కావలెను.
- సంప్రదించండి
94414 66455

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ: వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

జై శ్రీమన్నారాయణ
శ్రీ క్రిష్ణ ఆన్‌లైన్ సర్వీసెస్
మావద్ద అన్ని రకముల జాబ్ అప్లికేషన్స్ ఆన్‌లైన్ చేయబడును.
సెల్: 93938 41308
రైల్వే రిజర్వేషన్లు, బస్ రిజర్వేషన్ సదుపాయం కలదు.

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

## 'ఫకీరు' వేషాలకేం తక్కువలేదు

(మొదటిపేజీ తరువాయి)

వాటాదారులు ఉంటారని మనకు తెలుసు. కానీ పేకాడించడం కూడా ఒక కంపెనీయేనని మొదటిసారిగా మన జిల్లాకు చెందిన పేకాట నిర్వాహకులే నిరూపించారు. పెద్ద పెద్ద కంపెనీల్లో వాటాల కోసం షేర్లు విడుదల చేసినట్లే జిల్లాలో సూట్ ఆటకు కూడా వాటాదారులు ఉన్నారు. కాయిన్ రూపంలో సొమ్ములు పెట్టడం పేకాటలో ఆనవాయితీ. జిల్లాలో పేక నిర్వహిస్తున్న అనేక శిబిరాల్లో ఫకీరుకు వాటాలున్నాయి. అంతెందుకు.. గత ప్రభుత్వంలో తానే అన్ని ఖర్చులూ అప్పటి నాయకులకు చూసుకున్నానని ఫకీరు ఓపెన్‌గానే చెబుతుంటాడట. బెట్టింగ్‌లో పోలీసులు పట్టించుకోపోవడం, పేకాడుతుంటే సహకరించడం వల్ల ఏకంగా ఇప్పుడు గంజాయి రవాణా చేసినా తననేమీ చేయలేరన్న కోణంలో ఫకీర్ అండ్ బ్యాచ్ పేకాట ముసుగులో గంజాయిని తరలిస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బెట్టింగు మీద, పేకాట మీద నెలకు రూ.10 లక్షలు ఒక్క ఫకీరే సంపాదిస్తున్నట్లు చెబుతున్నారు. గోవాలో ఉన్న ఒక కేసినోలో మన జిల్లాకు చెందిన కొందరు ప్రముఖులకు వాటాలున్నాయి. అందులో ఫకీరు కూడా ఒకరని తెలుస్తుంది. ఇటీవల గోవాలో బిగ్–బి అనే కేసినోలో పేకాడేందుకు ఇక్కడి నుంచి అనేకమందిని ఫకీరు తరలించినట్లు సమాచారం ఉంది. నాలుగు రోజుల పాటు కేసినోలో జరిగిన ఈవెంట్‌కు హాజరవ్వాలంటే ముందుగా జిల్లాలో ఫకీరు వద్ద రూ.3 లక్షలు డిపాజిట్ చేయాలి. ఆ తర్వాత ఇటువంటి వారందర్నీ విమానమెక్కించి ఫకీరు గోవా తీసుకువెళ్తాడు. ఇలా తీసుకువచ్చినందుకు కేసినో నిర్వాహకులు ఫకీరుకు 7 శాతం కమీషన్ ఇవ్వడంతో పాటు విమానం టిక్కెట్లు కూడా రానుపోను ఏర్పాటుచేస్తారు. ఇక మందు, విందు, చిందు కోసం గోవాలో చెప్పుకోనక్కర్లేదు.

## మమ్ముల్ని ఏపీకి బదిలీ చేయండి

(సత్యంన్యూస్, అమరావతి)



చాలీచాలని రోజువారీ జీతంతో హైదరాబాద్ లాంటి సిటీలో ఇబ్బందులు పడుతున్న తమను ఏపీకి బదిలీ చేయించాలని కోరుతూ మంత్రి నారా లోకేష్‌ను కలిసి హోంగార్డులు తమ బాధలు వివరించారు. తాము రెండు తెలుగు రాష్ట్రాల్లో నష్టపోతున్నామని, ఏపీ ప్రభుత్వం ఇచ్చే అన్ని పథకాలు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పట్నుంచో ఉన్న తమ రేషన్ కార్డులను తొలగిస్తున్నారని, ఏపీ ప్రభుత్వం హోంగార్డులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, దానిలో పక్కా గృహాలు కట్టిస్తుందని, వాటిని తాము కోల్పోతున్నామని, వృద్ధాప్యంలో ఉన్న తమ తల్లిదండ్రులు అనారోగ్యానికి గురైనప్పుడు దగ్గరుండి మంచి, చెడు చూసుకోలేకపోతున్నామని లోకేష్‌కు వివరించారు. తమ మనోవేదన అర్థం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరారు. తమని ఆంధ్రప్రదేశ్‌కి తీసుకోవడం వల్ల ఏపీ గవర్నమెంట్‌కి లాభమే తప్ప నష్టమేమి ఉండదని, ఏపీలో తెలంగాణ హోంగార్డులు 400 మంది పని చేస్తున్నారని, వీరిని తెలంగాణకు పంపి, మన హోంగార్డ్స్‌ని ఇక్కడకు రప్పించి తమ జిల్లాలకు పంపితే సరిపోతుందని విన్నవించారు. తమ బాధను అర్థం చేసుకుని మన సచివాలయంలో ఉన్న హోంగార్డ్స్ ఫైల్ ఒక్కసారి పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై లోకేష్ మాట్లాడుతూ త్వరలోనే తెలంగాణలో వున్న వారందరిని ఆంధ్రాకు తీసుకుంటామని హామీ ఇచ్చారు. లోకేష్‌ను కలిసినవారిలో నారాయణ రెడ్డి, రంగారెడ్డి, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 140 మంది విద్యార్థులకు కంటిపరీక్షలు



(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

జాతీయ అంధత్వ, దృష్టిలోపం నివారణ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కారిపేట ప్రాథమికోన్నత పాఠశాల, ఉదయపురం, దేపిల్లివానిపేట, ముకుందవానిపేట, మలగాం ప్రాథమిక పాఠశాలల్లో 140 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాల్మిక్ అధికారి ఎంఆర్‌కే దాస్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న ఐదుగుర్ని గుర్తించి ఉచిత కళ్లద్దాలకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.మోహనరావు, ఆరోగ్య పర్యవేక్షకులు డి.కమలమ్మ, ఆరోగ్యం కార్యకర్తలు పి.రేవతి, బి.చెంచులక్ష్మి, ఆశా కార్యకర్తలు సీహెచ్ లక్ష్మి, ఐ.జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో రక్తదానం



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ప్రపంచ ఫార్మసిస్ట్‌ల దినోత్సవం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, ఫార్మసీ కళాశాల దర్శకుడు డాక్టర్ బి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ గత కొద్ది కాలంగా రక్తనిధి కేంద్రాలలో రక్తం నిల్వలు తక్కువ ఉండడంతో ప్రతినిత్యం వస్తున్న తలసేమియా రోగులు, గర్భిణీ స్త్రీలు, ప్రమాదంలో గాయాలైనవారికి రక్తం అందించడం కష్టమవుతున్న తరుణంలో వెంకటేశ్వర ఫార్మసీ విద్యార్థులు నిర్వహిస్తున్న ఈ రక్తదాన శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 80 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వీరికి రెడ్‌క్రాస్ సొసైటీ తరపున సర్టిఫికెట్, డోనార్ కార్డ్ అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పద్మశ్రీ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ తారక రామారావు, కళాశాల ఫార్మా డీహెచ్‌వోడీ డాక్టర్ పైల భానోజీరావు, కళాశాల యజమాన్యం, రెడ్‌క్రాస్ జాతీయ యువజన అవార్డు విజేత మిస్టర్ పెంకి చైతన్య, సిబ్బంది, రెడ్‌క్రాస్ వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల ఉపాధిపై ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

చేస్తే ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. శ్రీకాకుళంలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని, జిల్లాలో శాశ్వతమైన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని, ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు అందరి సహాయ సహకారాలు అందించాలన్నారు. మెగా డీఎస్సీతో 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపడుతున్నట్టు వివరించారు. భూ చట్టం, అన్నా క్యాంటీన్లు ద్వారా రూ.5కే నాణ్యమైన భోజనం దొరుకుతుందన్నారు. కుందువానిపేటను పర్యాటక ప్రాంతంగా ఏర్పాటుచేస్తామని, విశాఖపట్నం నుంచి మూలపేట పోర్టు వరకు బీచ్ కనెక్టివిటీ రహదారి ఏర్పాటు చేస్తామని వివరించారు. దీపావళి రోజున గ్యాస్ పథకం అమలు చేస్తామన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హుద్ హుద్ గృహాలపై ముఖ్యమంత్రితో మాట్లాడి వీలైనంత త్వరగా లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. జిల్లాలో 190 కిలోమీటర్లు తీర ప్రాంతం ఉందని, వినియోగించే విధంగా చర్యలు చేపడతామని వివరించారు. జిల్లాలో ప్రధానంగా వలసల నివారణ, మూలపేట పోర్టు నిర్మాణం, భోగాపురం విమానాశ్రయం ఏర్పాటుచేస్తే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ హుద్ హుద్ గృహాలు అర్హులైన వారికే ఇస్తామన్నారు. స్వచ్ఛ తాహి కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు.



ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన పనులను వివరించారు. దీపావళికి ఉచిత గ్యాస్ పథకం అమలు చేస్తామని, మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ సూరాడ సూర్యం మాట్లాడుతూ మత్స్యకార భరోసా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కుందువానిపేట – పిజిపేట–బలరాంపురం రహదారి వేస్తామని చెప్పారు. 66 మందికి మొదటి దశలో మంజూరు చేసి లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికపై గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ నగేష్, తహసీల్దార్ గణపతిరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఈ.రఘు, మండల ఇంజనీరింగ్ అధికారులు వై.ప్రదీప్ కుమార్, కనకేశ్వరరావు, గనగళ్లపేట సర్పంచ్ సూరాడ సూర్యం, మాజీ సర్పంచ్ అప్పారావు, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

## నెయ్యి వ్యవహారం నిగ్గుతేలాలి: గొలివి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యిలో యానిమల్ ఫ్యాట్ కలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడం, అటువంటిదేమీ లేదని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేర్కొనడం ఆరోపణ, ప్రత్యారోపణలుగా మాత్రమే మిగిలిపోకూడదని, ఈ వ్యవహారంపై నిగ్గు తేల్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గొలివి కరుణాకర్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో వేంకటేశ్వరుడి ప్రతిష్ఠ దెబ్బతిందని, కోట్లాది హిందువుల మనోభావాల పరిస్థితి కూడా అలాగే ఉందని, వైకాపా మాత్రం ఇది కేవలం రాజకీయ విమర్శలంటూ కొట్టిపారేస్తుండటంపై భక్తులకు ఏదో ఒక క్లారిటీ ఇవ్వాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. వైకాపా అధికారంలో ఉన్న కాలంలో తిరుమల లడ్డూ అపవిత్రమైందా? లేదూ అంటే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ నెయ్యిని వాడారా? అన్న క్లారిటీ ఇప్పటి వరకు ఎవరికీ లేదని, దీనిపై ఆధారాలతో భక్తులకు వివరణ ఇవ్వాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## గజరావు మృతిపై సంతాపం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రిటైర్డ్ ఎస్‌టీవో గజరావు ప్రభాకరరావు మృతిపై రాష్ట్ర ఎన్జీజీవో సంఘ ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తంనాయుడు, వ్యాపారవేత్త ఎస్‌వీడీ మురళీ, ఎస్టీవో తవిటన్న, సహచరులు సంతాపం తెలిపారు. గజరావు ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన కుమార్తె ఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు. ఈయన విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో పనిచేసారు. ఈయన చాలా శాఖల ఉద్యోగులకు అవిశ్రాంత సేవలు అందించారు. ఈయన తన సర్వీసు కాలంలో విశ్రాంత ఉద్యోగులకు, సర్వీసులో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు సర్వీస్ మేటర్స్ వంటి సాంకేతిక సమస్యలను పరిష్కరించేవారు. ఈయన మృతిపై సంబంధిత శాఖ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

## పాటల చిత్రీకరణలో ఆకలి మూవీ యూనిట్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కళింగ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై గూన అప్పారావు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఆకలి చిత్రం పాటల చిత్రీకరణ బుధవారం నుంచి ప్రారంభమైంది. ఇప్పటికే ఈ చిత్రం రెండు పాటలు మినహా పూర్తి అయింది. బుధవారం నుంచి రెండు పాటలు చిత్రీకరణ ప్రారంభించారు. ఈ పాటకు ప్రముఖ వ్యాపారవేత్త లఖినాన వెంకటసత్యం క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రముఖ యోగా సైంటిస్ట్ బాగాతి పాపారావు మాట్లాడుతూ ఆమదాలవలసలో ఫిల్మ్ స్టూడియో నిర్మించి నిరంతరం సినిమాలు నిర్మించాలనే ఆలోచన చేసిన దర్శక నిర్మాత గూన అప్పారావును అభినందిస్తున్నట్టు తెలిపారు ఈ పాటను హీరో హీరోయిన్‌లు అభిరామ్, స్రవంతి, ప్రతాప్, హాసినిలపై చిత్రీకరిస్తున్నామన్నారు.





## తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

(సత్యంన్యూస్, కొత్తూరు)

కర్లమ్మ రెవెన్యూ పరిధిలో భూముల రీసర్వేలో జరిగిన తప్పిదాలకు నిరసనగా రైతులు కొత్తూరు తహశీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ముట్టడించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు సీర్ల ప్రసాద్ మాట్లాడుతూ మంగళవారం నిర్వహించిన గ్రామసభలో రైతులను మభ్యపెట్టే హామీ ఇచ్చారన్నారు. అమలు సాధ్యం కాదని తెలిసి రైతులు నిరసనగా కొత్తూరు తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారని తెలిపారు. రీసర్వేలో రెవెన్యూ సిబ్బంది కొన్ని తప్పులను ఉద్దేశపూర్వకంగానే చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రీసర్వే చేసిన వీఆర్వో లుకలాపు రామారావు, విలేజ్ సర్వేయర్ గిరిరాజును కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆరోగ్యం బాగాలేదని చెప్పి సెలవులను పొడిగించుకుంటూ రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారని రైతులు వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎద్దు కన్నంనాయుడు, బోర లక్ష్మణ, పెదకోట ఎతిరాజు, పొగిరి రవి, చోడవరపు సింహాచలం తదితరులు పాల్గొన్నారు




## కూలీ రేట్లు తక్షణమే పెంచాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూలీరేట్ల ఒప్పందం ప్రకారం పెంచిన కూలీరేట్లను తక్షణమే వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ హమాలి ముఠా యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హమాలీసు జిల్లా ప్రధాన కార్యదర్శి చిక్కాల గోవిందరావు, జిల్లా అధ్యక్షులు కింబూరి శ్రీమన్నారాయణల ఆధ్వర్యంలో బుధవారం ఎంఐఎస్ పాయింట్ల వద్ద నిల్లరిబ్బన్లతో నిరసన చేపట్టారు. అనంతరం యూని యన్ నాయకులు చల్ల చిన్న ఆంజనేయులు, రావుల అంజిబాబు, ఎస్.వెంకటసుబ్బయ్యలు మాట్లాడుతూ తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు పెంచిన కూలీరేట్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



## విద్యార్థులలో శాస్త్రీయ వైఖరి పెంపొందాలి



(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

విద్యార్థులలో శాస్త్రీయ పరిజ్ఞానం పట్ల ఆసక్తిని, శాస్త్రీయ వైఖరిని పెంపొందించేందుకు చెకుముకి సైన్సు సంబరాలు దోహదం చేస్తాయని జనవిజ్ఞాన వేదిక యువత జిల్లా కన్వీనర్ బాడాన రాజు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోరుభద్రలో చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికను ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ ఆవిష్కరించి చెకుముకి పాఠశాల స్థాయి పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాడాన రాజు మాట్లాడుతూ మూఢ నమ్మకాలు లేని శాస్త్రీయ సమాజాన్ని నిర్మించడమే జనవిజ్ఞాన వేదిక ప్రధాన లక్ష్యమన్నారు. ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పిల్లలు మూఢ నమ్మకాలకు దూరంగా ఉంటూ ప్రశించేతత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మండల కన్వీనర్ టి.లోకేశ్వరరావు మాట్లాడుతూ అక్టోబర్ ఒకటిన మండల స్థాయిలో జరిగే చెకుముకి పోటీలలో ప్రతి ఉన్నత పాఠశాలకు చెందిన 8నుంచి 10 తరగతుల నుంచి ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు విద్యార్థులతో కూడిన జట్టు పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నౌపాడలో పాఠశాలస్థాయి చెకుముకి సంబరాలను మండల కన్వీనర్ ఎం.అసిరినాయుడు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.ఉమాశంకర్, వెంకటరెడ్డి, కె.త్రినాధరావు, డి.ఉమాదేవి, కె.రమణమ్మ, టి.విజయలక్ష్మి, బి.నాగమణి, కె.తవిటిరెడ్డి, బి.రజని, జి.జగదాంబ, బి.శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, శంకరరావు, గోపాలరెడ్డి, కమలకుమారి, సుశీలదేవి, సాయిశివాని, కృష్ణ, త్రివేణి, రవి పాల్గొన్నారు.

## రక్తహీనత మహిళకు అభయం

(సత్యంన్యూస్ టెక్కలి)

పట్టణంలో నివాసం ఉంటున్న కోట వైకుంఠరావు భార్య భాగ్యలక్ష్మి రక్తహీనత కారణంగా అత్యవసరంగా రక్తం కావాలని అభయం యువజన సేవా సంఘంను బుధవారం ఆశ్రయించారు. దీనిపై స్పందించిన సంఘం ప్రతినిధులు స్థానిక జిల్లా హాస్పిటల్ బ్లడ్‌బ్యాంక్ అధికారులతో మాట్లాడి ఏ పోజటివ్ బ్లడ్‌ను డాక్టర్ బి సునీతకు అందజేసినట్టు సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు. కార్యక్రమంలోసంఘం ప్రతినిధులు, జిల్లా హాస్పిటల్ సిబ్బంది శ్రీధర్ పాల్గొన్నారు.

## జేసీఐ 75 వసంతాల వేడుకల్లో పాలిశెట్టి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జేసిఐ ఇండియాలో ప్రారంభించి 75సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభసందర్భంలో కలకత్తాలో 75 ఇయర్స్ డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈసెలబ్రేషన్స్‌కు వివిధ దేశాల ప్రెసిడెంట్‌లు అతిధులుగా హాజరయ్యారు. జిల్లా నుంచి జేసిసి జోన్ చైర్మన్ హోదాలో పాలిశెట్టి మధుబాబు హాజరయ్యారు.



## డీ వర్మింగ్ డే మాప్ అప్ విజయవంతం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నులిపురుగుల నిర్మూలనలో భాగంగా సెప్టెంబర్ 25న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీలో ఈనెల 17వ తేదీన డి వార్మింగ్ డే నాడు మాత్రలు వేసుకొనని 2 నుండి 19 సంవత్సరాల వయస్సు గల వారికి ఈరోజు మాప్ అప్ కార్యక్రమంలో భాగంగా మాత్రల పంపిణీ జరిగిందని పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి డాక్టర్ నల్లి రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ 64విద్యాసంస్థల్లో, 69 అంగన్వాడి సెంటర్లో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. 17వ తేదీన మాత్రలు వేసుకోని 96మందికి ఈరోజు అందించామన్నారు. కార్యక్రమంలో మంగం శేఖర్‌బాబు, బరాటం లక్ష్మి పర్యవేక్షకులు, విజయ్‌భాస్కర్, పూర్ణ, ఉపకేంద్ర సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశాలు, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## కొత్తపేటలో ఇది మంచి ప్రభుత్వం

(సత్యంన్యూస్, గార)

ఎన్టీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లోనే రాష్ట్రంలో ప్రతి ఇంట్లో వెలుగు వచ్చిందని టీడీపీ శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ అన్నారు. మండలంలోని శాలిహుండం పంచాయితీ కొత్తపేట గ్రామంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మాజీ ఎంపీపీ గొండు భాస్కర్, సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అంటించారు. వందరోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై 'ఇది మంచి ప్రభుత్వం' బ్రోచర్‌ను ఇంటింటికీ అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వంద రోజుల్లో అవ్వా, తాతలకు నెలకు రూ.4వేలు పింఛన్, దివ్యాంగులకు నెలకు రూ.6వేలు అందిస్తున్నామని తెలిపారు. వైకాపా పాలనలో వ్యవస్థలన్నీ భ్రష్టు పట్టిపోయాయని, తిరిగి వాటిని పునరుద్ధరించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీపావళి నుంచి ఉచితంగా గ్యాస్ అందిస్తామన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.